# ఎండుటాకు

- బి.వి.ఎన్.స్వామి

దూరంగా ఎవరో గొడవపడుతున్నట్లు లీలగా కనిపిస్తోంది. ఎవరా? అని పరికించి చూస్తే రమేష్, మహేష్‌ల లాగా అనిపించింది. నమ్మలేక పోయాను. దగ్గరగా వెళ్లి చూసేసరికి వాళ్లిద్దరే. ఈ మహేష్ గాడితో వచ్చిన తంటా ఇదే. ఆవేశపరుడు. తను చెప్పేది డెమాన్‌స్ట్రేట్ చేస్తూ, గొంతు పెంచి చెప్పడం వల్ల గొడవ గొడవగా ఉంటుంది. ఇంతకీ ఏమిటి అని ఆరా తీస్తే అసలు విషయం అర్థమయింది. వారేదో సత్యాన్వేషణలో వున్నారు. నన్ను చూడగానే మహేష్, ఒరేయ్ రాము...

'ఈనాటి నారీ లోకం మన చరిత్రలో గల వీర మాతల్ని, వీర పత్నులను ఆదర్శంగా తీసికొని పురోగమించాలని నా ఉద్దేశం. నీవేమంటావు? ప్రశ్నించాడు.

నీ సంగతేమిటన్నట్లు రమేష్ వంక చూశాను.

'నేటి యంత్ర సమాజం ఆదర్శాల్ని స్వీకరించే స్థితిలో లేదంటాను. నీవేమంటావు' ప్రశ్నించాడు రమేష్.

ఇద్దరినీ సమాధానపరచడానికి నాకు తెలిసిన జీవితాన్ని చెప్పనారంభించాను.

- - -

కరీంనగర్ జిల్లాలోని అటవీ ప్రాంతం. ఎటు చూసినా అడవి. ప్రశాంతంగా... గంభీరంగా... భయానకంగా... ఒంటరిగా... అడవికి తోడు అన్నట్లుగా అడవి అంచును ఆనుకుని ఒక మోస్తరు పల్లెటూరు. అడవంతా మాదే అన్నట్లు మనుషులు అడవిలోకి, మనమంతా ఒక్కటే అన్నట్లు ఊర్లోకి అడవి జంతువుల రాకపోకలు సాగేవి. అటువంటి ఊర్లో ఊరికి దూరంగా, అడవికి మరీ దూరంగా పోలీస్‌స్టేషన్. అందులో కానిస్టేబుల్‌గా పనిచేసేవాడు సాగర్. ఇద్దరు పిల్లలు, భార్య. తను ఇదీ సంసారం. సంతానం ఇద్దరైనందుకు తెగ బాధపడిపోయేవాడు. అద్దె తక్కువని ఊరి చివర్లోని డాబా ఇంట్లో ఉండేవారు. ఆ విధంగా ఊరికి ఒక చివర ఇల్లు. మరో చివర పోలీస్‌స్టేషన్. ఈ రెంటి మధ్య సాగర్ సైకిల్ ప్రయాణం. ఖర్చులెన్ని తగ్గించుకున్నా దురలవాట్ల మూలంగా ఆదాయం సరిపోయేది కాదు. వృత్తి పట్ల నిబద్ధత గల వ్యక్తి కావడం వల్ల పై అధికారుల మన్ననలు పొందాడు. పిల్లలన్నా, భార్య సుజాతన్నా ప్రేమ. తాగుడంటే అంతకంటే ప్రేమ. ఉండేది అడవిలోనైనా, తాగుడుకు బానిసైనా ఇంట్లో కలర్ టీ.వీ.తో సహా అన్నీ అమర్చాడు. కాలం గడుస్తోంది. పుస్తక సహచర్యంలో సుజాత సౌజన్యమూర్తిగా బ్రతకసాగింది. అదిగో ఆ తరుణంలో జరిగిందో సంఘటన. వారి జీవితంలో మరచిపోలేని ఘటన.

ఆ రోజు నైట్ డ్యూటీపై సాగర్ పోలీస్‌స్టేషన్ కెళ్లాడు. ఇంట్లో ఇద్దరు పిల్లలతో సుజాత. రాత్రి పొద్దుపోయే వరకు టీవీ చూస్తూ గడిపి గాఢ నిద్రలోకి ఒరిగిపోయారు. చిక్కటి చీకటిలో నిద్ర ఓలలాడుతోంది. నిద్రలో శరీరాలు సేదతీరుతున్నాయి. ఏ మాత్రం మెలకువని సహించలేని స్థితి. ఊరంతా చీకట్లో జోగుతోంది. ఆ సమయంలో 'అమ్మా' అనే గావుకేక సుజాత నిద్రను దెబ్బతీసింది. పేగు తెగిన అనుభూతి. లేచి చూసింది. పక్కలోని కొడుకు లేచి దద్దరిల్లసాగాడు. కొడుకును దగ్గరకు తీసుకుని, లైట్ వెలుతుర్లో చూసింది. చెవిపై గాయం కనపడింది. రక్తం కారుతోంది. కరిచింది దోమా? పురుగా? సందేహ నివృత్తి కోసం మంచంలో నుండి పిల్లల్ని దించి దుప్పట్లు తొలగించింది. ఏమీ లేదు. ఇంకా అనుమానం. తలగడ తీసింది. అంతే...! వాతావరణం చల్లబడ్డట్లయింది. చలిలో సుజాత శరీరం వణికిపోయింది. చరచరా నాగుపాము మంచం కిందికి జారిపోయింది. పరుగులాంటి నడకతో పిల్లలిద్దర్నీ తీసుకుని ఇల్లు విడిచింది. తెరచిన తలుపులతో ఇల్లు, ముడుచుకుపోయిన తలపులతో సుజాత. పోలీస్‌స్టేషన్ వైపు వెళ్లింది. హఠాత్తుగా ప్రత్యక్షమైన సుజాతను చూసి సాగర్ మనసు కీడు శంకించింది. సాగర్ కుటుంబాన్ని పోలీసు జీపు

గోదావరిఖని వైపు తీసుకెళ్లింది. పోలీస్ జోక్యంతో ప్రాథమిక చికిత్స జరిగింది. అప్పటికే సమయం మించిపోయింది. సుజాతకు పుత్రశోకం మిగిలింది.

సంసారాన్ని పట్టించుకోని భర్త, ఊడిపడ్డ పుత్రశోకం, వెనకా ముందూ లేని ఒంటరితనం సుజాతను చుట్టుముట్టాయి. సమస్యలలో ఉక్కిరిబిక్కిరి అయింది. ఒక్కసారి ఆకాశంలో నుండి భూమిపై పడ్డట్టయింది. తన టీవీ సీరియల్ నాలెడ్జ్ సమస్య పరిష్కారాన్ని చూపలేకపోయింది. పుత్రశోకంతో వున్న సుజాతను పలకరించాలనే నెపంతో వచ్చిన వాళ్లందరితో తన సమస్యలను చెప్పుకోవడం వల్లనూ, వారి అభిప్రాయాలు వినడం వల్లనూ కొత్త ఆలోచనలు పురుడు పోసుకోసాగాయి. ఆ విధంగా సుజాతకు బదిలీ ఆలోచన వచ్చింది. తమ కుటుంబంపై ఉన్న సానుభూతి తొలగక ముందే అటవీ ప్రాంతం నుండి పట్టణ ప్రాంతానికి బదిలీపై వెళ్లాలనే కృత నిశ్చయానికి వచ్చింది. మరో రెండు ఎన్‌కౌంటర్లు చేస్తే రాబోయే ప్రమోషన్ అవకాశాన్ని కాలదన్నుకుని బదిలీకి ప్రయత్నించాడు సాగర్. ఫలితంగా కరీంనగర్ టౌన్‌కు బదిలీ అయింది.

తన కొడుకును పొట్టన పెట్టుకున్న ఆ పరిసరాల నుండి వెళ్ళిపోయే వేళ, రోజుటిలాగే అలవాటు ప్రకారం, సాయంత్రం డాబా ఎక్కింది. ఇన్నాళ్ల నుండి ప్రశాంతమైన ప్రకృతి సహచర్యాన్ని పొందిన తను రేపటి నుండి కాంక్రీటు కట్టడాల మధ్య బ్రతకాలనే స్పృహ బాధించింది. తను ప్రతిరోజూ ఉషోదయాన వినే ఆ గొంతు, ఈ ప్రకృతి, తన జీవితాన మరపురాని విషయాలు. టేకు, మద్ది, రావి, చిట్టిరేగు లాంటి చెట్లే కాక చిన్నచిన్న పొదలు దగ్గర దగ్గరగా, ఒకటిగా కలసిమెలసి, వెరసి అడవిగా ప్రకృతి గోచరించింది. తనివితీరా ప్రకృతిని జుర్రింది. బయ్యి...మంటూ ఇంటి ముందు వ్యాన్ హారన్ మోగడంతో డాబా దిగింది. సామానంతా వ్యాన్‌లో పెట్టింది. ఇల్లంతా ఖాళీ అయింది. తెల్లారే ప్రయాణం. రాత్రంతా సగం నిద్ర... కలత నిద్ర. గతం జ్ఞాపకాలు, వర్తమానం శూన్యత, భవిష్యత్తుపై పెంచుకున్న ఆశలు సుజాతను ఉక్కిరిబిక్కిరి చేశాయి. తెల్లవారింది. తాము వెళ్లే విషయం అందరికీ తెలిసి పలకరించి వెళ్లారు. అడవి వీడ్కోలు చెబుతున్నట్లుగా ఊగసాగింది. మనసు కుదుటపడింది. పొద్దు పొడిచింది. పిల్లలు పేడ కోసం పశువుల వెంబడి తట్టలతో బయలుదేరారు. ఇంకా పాట వినిపించదేమి? సుజాత మనసు పాట కోసం తహతహలాడింది. ఆ పాటల భావాలు రసప్లావితాలు. రోజూ ఆ పాట వినిపించే దిక్కు చూడసాగింది.

'ఏమో దిక్కులు జూడవడితివి. జల్దచ్చి ఎక్కు' అసహనంగా అన్నాడు సాగర్.

'ఆగాగు. నీ డ్యూటీ డ్రెస్ వున్న బ్యాగు మర్సిపోయిన' అంటూ ఇంట్లోకెళ్లింది.

'నాల్గొద్దులైతే నన్నే మర్సిపోయేటట్టున్నావు' ముద్దముద్దగా వస్తున్నాయి మాటలు.

బ్యాగు తీసికొని వచ్చి వ్యాన్‌లో కూర్చొన్న సాగర్‌కు ఇచ్చింది. మళ్లీ పాట కోసం... ఆ దిక్కుగా చూపు సారించింది.

'అటేం పాతర పెట్టుకున్నావే. ఎద్దుచ్చపోసినట్లు, నీ బుద్ధి కూడా వంకర టింకర పోతుందా? ఎన్కకెక్కు. ఎత్తేసుట్ల, దిగేసుట్ల సామాను కింద పడదిక్క. జరంత భద్రంగ జూడు' అంటూ డ్రైవర్ని పిలిచాడు.

సుజాత వ్యాన్ ఎక్కింది. చివరిసారిగా టైర్లను, ఇంజన్‌ను పరిశీలించసాగాడు డ్రైవర్. ఆ సమయాన, ఆ పాటను గాలి తరంగాలు మోసుకొచ్చాయి. కర్ణభేరి రిక్కించి వినసాగింది. కోరుకున్న పాట దొరికింది. అటువైపే మనసు పెట్టింది.

నాగేటి చాళ్లల్ల నా తెలంగాణా నా తెలంగాణా
నవ్వేటి బతుకులు నా తెలంగాణా నా తెలంగాణా

... ... ... ... ... ... ... ... ... ... ... ...

తూగేటి పువ్వుల్లు తాంబాల మరి
తీరొక్క రంగుల్ల తీరిచ్చినా పువ్వు ...తీరొక్క...
బంగారు రంగుల్లు బాజారులన్నీ
ఆహా! బతుకమ్మ పండుగ నా తెలంగాణా నా తెలంగాణా
బంతిపూలా తోట నా తెలంగాణా

'వారీ రాజేషా! ఈన్నే కూసుండపెడ్తావురా. పొద్దెక్కనే ఎక్కె. జల్దీ స్టార్ట్ చేయి. కరీంనగర్‌కు పోయేసరికి శానసేపయితది గావచ్చు. డ్రైవర్ని కేకలేశాడు సాగర్.

అవాంతరానికి సుజాత నొచ్చుకుంది. రాజేష్ వ్యాన్ ఎక్కాడు. పాట వినిపిస్తోంది.



... ... ... ... ... ... ... ... ... ... ... ... ...

ఊరుగాచే తల్లి ఉరిమి జూడంగ

బువ్వ లేని తల్లి బోనమాడింది

అయ్యో! బువ్వ లేని తల్లి బోనమాడింది

చేనుకొచ్చిన పురుగు చెరిగిపోసింది

ఆహా! బోనాల పండగ నా తెలంగాణా, నా తెలంగాణా

ఆకలిదప్పుల మంట నా తెలంగాణా, నా తెలంగాణా

'సారూ! బయల్దేరుతున్నాం. ఏమన్నా మర్చిపోయింర్రో, మల్లొక్కసారి ఇంట్లకు పోయి చూసుకొచ్చుకుంటరా'

'అరేయ్! ఆ ఇంట్ల నా కొడుకు పోయిండు. నేను పోయి సూత్తె దొర్కుతాఁడ్ర. జల్ది పోని' డ్రైవర్ పైకి ఒంటికాలిపై లేచాడు సాగర్.

వ్యాన్ స్టార్ట్ అయింది. రోడ్డుంపైకి వెళ్లడానికన్నట్లు, వ్యాన్‌ని వెనక్కి పోనిచ్చాడు. వెనక్కి జూస్తూ స్టీరింగ్ తిప్పసాగాడు. బండి వెనక్కి

మెల్లగా కదలసాగింది. అలాగే వెనక్కి... మరింత వెనక్కి... పాట వినవచ్చే వైపుకే... పాట మరింత స్పష్టంగా...

... ... ... ... ... ... ... ... ... ... ... ...

కలిసేటి చేతుల్ల కన్నీటి పాట

చిందోల్ల సిందుల్ల చిగురించె నాట్యం ...చిందోల్ల...

ఒగ్గు మద్దెల డప్పు వాద్య సంగీతం

ఆహా! కళలకే పుట్టుకా నా తెలంగాణా- నా తెలంగాణా

పాట గాచిన పట్టు నా తెలంగాణా- నా తెలంగాణా

ఎక్సలేటర్ బలంగా నొక్కాడు డ్రైవర్. రోడ్డుపై వేగంగా దూసుకుపోసాగింది వ్యాన్. చెట్టు-పుట్ట, ఇల్లు-వాకిలి, పాట-ప్రకృతి ఇవన్నిటికీ దూరంగా, కరీంనగర్‌కు దగ్గరగా, తన ప్రయాణం సాగించింది సుజాత.

- - -

ఉన్న ఒక్కగానొక్క కొడుకు మంచి చదువుల కోసం, మంచి బడిలో వేయాలనే సంకల్పం, బడికి దగ్గరగా ఇల్లు కిరాయి తీసుకోవాలనే ఆలోచన, పట్టణంలోని ఒక ఎగువ మధ్యతరగతి కాలనీలో నివాసం ఉండేలా చేశాయి. ఇంగ్లీషు మీడియంలో పిల్లవాని చదువు, అందమైన ఇల్లు సుజాతకు సంతృప్తిని కలిగించాయి. కానీ సంతృప్తి వల్ల పొందిన ఆనందం కన్నా, బాధనే ఎక్కువ అనే విషయం సుజాత కొద్దిరోజుల్లోనే గ్రహించ గలిగింది. ఇప్పుడున్నవన్నీ ఇలాగే కొనసాగాలంటే తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపరచుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఫలితంగా సుజాత ప్రైవేట్ పాఠశాలలో పనికి కుదిరింది. ప్రొద్దునే లేవడం కోసం రాత్రిపూట పరుగు. పనికి తొందరలో ఉదయం పరుగు. ఈ పరుగుల ఫలితాలు. జీతాలు-జీవితాలు. జీతమే జీవితం. రాబడి-ఖర్చు. మిగులు-తగులు. లెక్కలు కట్టింది. సాగర్ ముందు పెట్టింది. తాగుడు మానమంది. లేనట్లయితే వచ్చే జీతం మొత్తం తన చేతికి అందివ్వమంది. సాగర్ నిర్బలత్వం, సుజాతను కుటుంబంలో ఆర్థిక నిర్ణాయక శక్తిగా నిలబెట్టింది. ఇప్పుడు సాగర్ జీతాన్ని ఉత్పత్తి చేసే యంత్రం. సుజాత కుటుంబాన్ని నడిపే యంత్రం. ఈ యంత్రాల వేగంలో తన-పర, పాట-ప్రకృతి ఏవీ వచ్చి చేరే అవకాశం లేదు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు విదేశీయానానికి బాటలు పడ్డాయి.

ఆ రోజు ఆదివారం. డ్యూటీకి వెళ్లడానికి డ్రెస్ వేశాడు సాగర్. వారాంతపు సెలవు గనక సుజాత ఇంకా లేవలేదు.

'డాడీ వేర్ ఆర్ యూ గోయింగ్'

'ఊర్లె బహిరంగ సభ ఉంది. ఎవడో పొల్టికలోడు వత్తుండు. బందోబస్తుకు పోతన్న'

'వాటెబౌట్ యువర్ బ్రేక్‌ఫాస్ట్'

'ఏమున్నాదిరా! పోలీసోని బతుకంత హోటల్ల తిని మోటర్ల పండదేనాయె. నువ్వయితే ముందుగాల మంచంల నుంచి లే. లేసి పొద్దటి గాలి తిను పో' అంటూ బయటకెళ్లాడు.

ఆనాడు జరగబోయే ఊరేగింపు మరియు బహిరంగ సభలకు ఎవరు, ఎక్కడ డ్యూటీ చేయాలో ఆదేశించబడ్డది. ఆ విధంగా సాగర్ తన తోటి కానిస్టేబుల్‌తో కలసి వెళ్లాడు.

'సాగరన్నా! ఆర్.టి.సి. వాళ్ల సమ్మెల అందరు కలుస్తుంద్రు. మనమెందుకు కలువద్దే'

'మనది ఎమర్జెన్సీ సర్వీస్ డిపార్ట్‌మెంటు కనుక'

'అగో! డాక్టర్లు, పోస్టాఫీసోల్లు చేత్తేం లేదు కని మనం చేత్తె తప్పా? సరే గని ఆర్.టి.సి. వాళ్లు సమ్మె చేసుడు మంచిదంటవా కాదంటవా?'

'మంచిదే'

'లేకపోతె ఏందన్నా గదేదో టాక్సట. ఆర్.టి.సి. బస్సుల మీద ఎక్కువ, ప్రైవేట్ బస్సుల మీద తక్కువ ఏసింద్రట. అట్లజేస్తె ప్రైవేటోన్ని సంకకెక్కిచ్చుకున్నట్టే కదా?'

'సంక కేంది? నెత్తికెక్కిచ్చుకునుడే జరగవట్టె'

'అయినా మన నౌకరిగాండ్లకు పనిజేసుడు

## అక్షరమాల

భార్యా భర్తలన్న వారు
జంట గానే కాదు సుమా
జతగా కూడ బ్రతక వలె
జీవన మాధుర్యం చిలక వలె

- దేవినేని జగన్మోహనరావు

చాతనయిత లేదే'

'మనం పని చేయకపోతే, ఎవలు జేత్తరు తమ్మీ! కాకపోతె అట్ల ప్రచారం జేత్తున్నారు'

'నిప్పు లేంది పొగస్తదా అన్నా'

'చంపదలచుకున్న కుక్క ఎర్రిది అని ప్రచారం చేస్తనే దాన్ని చంపే అవకాశమొస్తది. గట్లనే లాభాల్లో ఉన్న ఏ సంస్థనైనా, నష్టాల్లో నడుస్తుంది అని ప్రచారం చేసినపుడే ప్రైవేట్‌పరం చేసే అవకాశం వస్తది'

'మనోడెవడో, మందోడెవడో తెలుస్త లేదు. మన దాంట్ల మనకే కొట్లాటలు పెట్టెటోడెవడె'

'మార్కెట్ శక్తులు'

'నాకు పెద్ద పెద్ద మాటలు తెల్వయే. సూటి జూసి గులేర్ దెబ్బ పెట్టినట్లు చెప్పు'

'నీకిస్తే నాకేమొస్తది? అనే ఆలోచన ఒకటుంది ఒప్పుకుంటావా'

'ఒప్పుకుంట'

'ఆ ఆలోచనను పుట్టించి, పెంచుతున్నది మార్కెట్ శక్తులే'

'ఏమోతీయ్! ఆ లొల్లి మనకెందుకు. తలనొప్పి. ఇగో ఓ సిగరెట్ అయితే గుంజు' అంటూ సిగార్ ముట్టించాడు కానిస్టేబుల్.

ప్రైవేటైజేషన్‌కు వ్యతిరేకంగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీయెత్తున ఊరేగింపు వస్తున్నది. బ్యానర్స్, ప్లేకార్డ్స్ ప్రతీ ఒక్కరి చేతిలో ఉన్నాయి. ఊరేగింపులో సమాజంలోని అన్ని రకాల వర్గాలున్నాయి. వారు తమ ఉనికిని తెలిపే బ్యానర్స్ పట్టుకుని ఊరేగింపులో నడుస్తున్నారు. ఊరేగింపు ముందు పోలీస్, వెనక పోలీస్. ఊరేగింపు గాడి తప్పకుండా, శాంతి భద్రతల కోసం. సజావుగా సాగింది ఊరేగింపు. ఊరేగింపుగా వెళ్లి కలెక్టరేట్‌లో ఉన్న మంత్రి గారికి వినతిపత్రం ఇవ్వాలని నాయకులు, కుదరదని పోలీసు అధికారులు, ఇరువురి మధ్యా వాగ్వివాదం జరిగింది. వివాదం ముదిరింది. ఊరేగింపు సాగర్ నిల్చున్న ప్రదేశం వద్ద ఆగింది. తొక్కిసలాట మొదలైంది. అందులో నుండే ఘర్షణ మొదలైంది. ఊరేగింపును అదుపులో పెట్టడం కోసం పోలీసులు లాఠీచార్జి చేశారు. సాగర్ లాఠీకి పని దొరికింది. ప్రతిస్పందనగా ఆందోళనకారులు రాళ్ల వర్షం కురిపించారు. క్షణంలో ఆ ప్రాంతమంతా రక్తసిక్తమయింది. ఊరేగింపు చెదిరిపోయింది. క్షతగాత్రులు మిగిలారు. క్షతగాత్రుల్లో సాగర్ ఒకడు.

క్షతగాత్రులందర్నీ ఆసుపత్రికి తరలించారు. సుజాతకు కబురందింది. ఆసుపత్రిలో సాగర్‌ను చేర్చేసరికి, సుజాత చేరింది. సీరియస్‌గా ఇంజ్యూర్ అయిన సాగర్‌ని చూసి భయంతో వణికింది. ఒక్కసారి శూన్యం ఆవహించింది. నిస్సహాయతతో కన్నీరు కార్చింది. సాగర్‌ను హైదరాబాద్ తీసుకెళ్లాలనే వైద్యుల సూచన సుజాత దినచర్యను తలకిందులు చేసింది. ఇప్పుడు లోకం అంతా తలకిందులుగా అనిపించసాగింది. జీవచ్ఛవంగా సాగర్. అచేతనంగా సుజాత. వీరిద్దరినీ హైదరాబాద్ దిశగా మోసుకెళుతూ అంబులెన్స్. కొన్నాళ్లకు ఖాకీ డ్రెస్‌లో, చేతిలో లాఠీతో, కరీంనగర్ రోడ్లపై డ్యూటీ చేస్తూ దర్శనమిచ్చింది సుజాత.

'ఇప్పుడు చెప్పరా మహేష్! నీ దృష్టిలో సుజాత ఎవరో'

'... ... ... ... ... ... ... ... ... ... ... ...'

'నీ సంగతేంటిరా రమేష్'

'... ... ... ... ... ... ... ... ... ... ... ...'

'వ్యక్తులను నాయకులుగా చేసి రచించిన చరిత్ర వల్ల వచ్చిన చిక్కు ఇది. చరిత్ర ఎప్పుడూ ప్రజారాశుల అభివృద్ధి పరంపరను నిష్పాక్షికంగా విశ్లేషించి చెప్పేదిగా ఉండాలి. నేడు చరిత్రలో తప్పులు దొర్లినవని, చరిత్రను తిరగరాసే ప్రక్రియ చేపట్టారు. మళ్లీ చరిత్ర పునరావృతం కాకుండా ఉండాలి. లేకుంటే గతం ఒక్కటే అయినా, చరిత్రలు పది అయ్యే అవకాశం ఉంది' అంటూ దీర్ఘంగా నిశ్వసించాడు రాము.

తన భావజాలపు కేంద్రకానికి తిరుగులేని దెబ్బ తాకడం వల్ల అక్కడ ఉండలేక వెళ్లిపోయాడు మహేష్.

'అన్నా! వనవాస, జనవాస క్లేశాలకు తట్టుకున్న సుజాత ఇప్పుడు మంచిగున్నదా' అడిగాడు రమేష్.

**(నందిని సిద్దారెడ్డి గారికి కృతజ్ఞతలతో...)** ○